## క్లుప్తంగా

### ఆలయంలో ప్రత్యేక పూజలు



సంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

**తంగళ్లపల్లి:** మండలంలోని పద్మనగర్ గ్రామంలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో మాఘ మాసం చివరి రోజు సందర్భంగా శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మణిద్వీపవర్ణ పారాయణంలో 150 మంది మహిళా భక్తులు ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ వ్యవస్థాపకుడు లగిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

### ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి కార్తిక్

**బోయినపల్లి:** 19 సంవత్సరాల్లోపు వారందరికీ నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలని బోయినపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కార్తిక్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో ఈనెల 10న నిర్వహించే జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రవణ్‌కుమార్, సూపర్‌వైజర్ శశికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డిపేట:** నులిపురుగుల నివారణపై మండల వైద్యాధికారి సారియా అంజుం ఆధ్వర్యంలో మండల పరిషత్‌లో అవగాహన కల్పించారు. డాక్టర్ సారియా అంజుం మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల వయస్సులోపు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. 10న విద్యార్థులకు, 17న మాప్ ఆప్ కార్యక్రమం ద్వారా మిగిలిన విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయాలన్నారు. పీహెచ్ఎన్ రజనీ, సూపర్‌వైజర్లు పద్మ, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ వార్షికోత్సవం




**ఎల్లారెడ్డిపేట:** మండలంలోని బండలింగంపల్లిలో శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్స వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం హనుమాన్, దత్తాత్రేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకం, అర్చన, నివేదన, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శ్రీ రాజు గురుస్వామి, శ్రీ బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ బైరోజు అన్వేష్ ఆచార్య, ఉప్పుల అభిలాష్ ఆచార్యులు హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నర్ర అంజిరెడ్డి, బాల్‌రాజ్ నర్సాగౌడ్, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

### ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



**ముస్తాబాద్:** మండలంలోని ఆవునూర్‌లో శ్రీ మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను శుక్రవారం రెండో రోజు ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. దేవతా మూర్తులకు అభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం స్వామివారి తెప్పోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

### రెడ్డి సంఘం అధ్యక్షుడికి సన్మానం



**ఎల్లారెడ్డిపేట:** రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డిని పలువురు నాయకులు సన్మానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి బాల్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేట గౌడ సంఘం, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు.

# ఏటీసీతో 'ఉపాధి'

- రుద్రంగిలో ఏటీసీ కోసం రూ.42 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు, ప్రజలు



స్థల పరిశీలన చేస్తున్న ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**రుద్రంగి:** మండలకేంద్రంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటుకు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరయ్యాయి. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌తో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని మండల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఉన్నత చదువులు చదివి ఏ ఉద్యోగం లేక ఏం చేయాలో తెలియని నిరుద్యోగ యువతకు ఏటీసీ ఒక వరంలా మారనుంది. మారుమూల ప్రాంత యువత, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా ఏటీసీ మంజూరుకు ప్రత్యేక కృషి చేసిన, నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక చొరవచూపుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మండల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

**ఏటీసీ ఏర్పాటుకు స్థల పరిశీలన..**

మండలకేంద్రానికి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ మంజూరు కావడంతో ఏటీసీ ఏర్పాటుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మండలకేంద్రంలో స్థానిక అధికారులు, నాయకులతో కలిసి స్థల పరిశీలన చేశారు. విశాలవంతమైన ప్రభుత్వ స్థలాన్ని ఎంపికచేసి అన్ని హంగులతో ఏటీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు వారు ప్రత్యేక కార్యాచరణ మొదలుపెట్టారు. దీంతో త్వరలోనే యువతకు ఏటీసీలో కోర్సులు ప్రారంభంకానున్నాయి.

**రూ.42 కోట్లు మంజూరు**

రుద్రంగి మండల కేంద్రంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు రూ.42 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 6 స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులలో 240 సీట్లతో ఏటీసీ ఏర్పాటు చేసి యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

### నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



వేములవాడ ప్రాంతాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల సహకారంతో నియోజకవర్గానికి నిధులు తీసుకువచ్చేలా కృషిచేస్తా. మండలకేంద్రంలో యువత, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సీఎం, మంత్రులు ఏటీసీని మంజూరు చేశారు.

– ఆది శ్రీనివాస్ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే



**ఎల్లారెడ్డిపేట:** మండలంలోని వెంకటాపూర్‌లో మురుగుకాలువలు కంపుకొడుతున్నాయి. వాటిని శుభ్రం చేయాలని ప్రత్యేకాధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. మురుగునీరు నివాసాల్లోకి రావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో కొన్ని మురుగుకాలువల్లో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు తొలగించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరు నిల్వకుండా శుభ్రంచేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : అరేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, వెంకటాపూర్ సెల్‌నంబర్ : 8790223461

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

# మహేందర్ అన్న బాగున్నవా..

- కేటీఆర్ పలకరింపు..



కేకే మహేందర్‌రెడ్డితో మాట్లాడుతున్న కేటీఆర్

**ముస్తాబాద్:** గంభీరావుపేట మండలకేంద్రంలో జరుగుతున్న శ్రీ మహంకాళి ఆలయ ఉత్సవాల్లో ఎమ్మెల్యే కేటీఆర్ పాల్గొన్నారు. ఈ ఉత్సవాలకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కూడా హాజరయ్యారు. ఇరువురు ఎదురెదురు పడగా, కేటీఆర్ మహేందర్ అన్న బాగేనా అంటూ పలకరించారు. ఫైన్ అంటూ మహేందర్‌రెడ్డి పలకరించగా ఇరువురు కరచాలనం చేసుకున్నారు. 2009లో కేటీఆర్‌కు అప్పటి టీఆర్ఎస్ సిరిసిల్ల టికెట్ ఇవ్వగా, మహేందర్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేశారు. కేటీఆర్ అప్పుడు 171 ఓట్ల మెజార్టీతో మహేందర్‌రెడ్డిపై గెలుపొందిన విషయం తెలిసిందే. అనంతరం ఇరువురు నేతలు ఎప్పుడు కలుసుకోలేదు. గంభీరావుపేట ఉత్సవాల్లో ఎదురెదురుగా ఇరువురు నాయకులు తారసపడగా ఆత్మీయంగా పలకరించుకున్నారు

### డిగ్రీ కళాశాలలో నేషనల్ గర్ల్ చైల్డ్ డే



పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

**వేములవాడరూరల్:** వేములవాడ పట్టణంలోని శాత్రాజుపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో నేషనల్ గర్ల్ చైల్డ్ డే శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకలు వచ్చేనెల 8న ముగుస్తాయని కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు సాధికారత, విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాన్ని వెలికితీయడం, సామాజిక సవాళ్లను అధిగమించడానికి, ఉన్నత స్థానాన్ని సాధించడానికి వారిని ప్రోత్సహిస్తాయని పేర్కొన్నారు. మొదటి వారం క్రియేటివిటీ వీక్‌లో భాగంగా గర్ల్స్ లీడ్ ద వే అనే అంశంపై విద్యార్థులు ఆర్ట్, పోస్టర్ ప్రదర్శన, చరిత్రలో మహిళా నాయకులపై దృష్టిసారించే నాటక పోటీలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుమలత, నిర్మల హృదయ, రజిని, సంధ్యారాణి, కమిటీ మెంబర్స్, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

# అశోక్‌కుమార్‌కు ఉపాధ్యాయ సంఘాల మద్దతు



అశోక్‌కుమార్‌కు మద్దతు పలుకుతున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

**సిరిసిల్లటౌన్:** ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్‌కు జిల్లా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. శుక్రవారం సిరిసిల్లలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మద్దతు ప్రకటించారు. టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు దుమాల రమనాథ్ రెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ కో కన్వీనర్ పరకాల రవీందర్, తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య, టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు, పిట్టల దేవరాజు, వివేకానంద్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

# కూలీ అడిగితే బెదిరిస్తున్నారు



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న కార్మిక నేతలు

- పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

**సిరిసిల్లటౌన్:** కూలీ డబ్బులు అడిగితే కొందరు చేనేత చీరల వ్యాపారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ ఆరోపించారు. ఈమేరకు చేనేత, జౌళిశాఖ ఏడీకి ఫిర్యాదు చేసిన అనంతరం మాట్లాడారు. కూలీ ఒప్పందం గతేడాది మేలోనే ముగిసిందని అప్పటి నుంచి యజమానుల నుంచి స్పందన లేదన్నారు. వారి నుంచి స్పందన లేకపోవడంతో ఈనెల 4న కూలీ పెంచాలని యజమానులకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. దీనిపై కార్మికులను, ఆసాములను పిలిపించుకొని యజమానులు ఇష్టారీతిగా మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. వెంటనే యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వద్నాల వీరేశం, ప్రతాప్, సూర్యనారాయణ, వేణు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీ ప్రారంభానికి ఏర్పాట్లు



ప్రారంభోత్సవానికి సిద్ధంగా పీహెచ్‌సీ భవనం

**ముస్తాబాద్:** మండలంలోని పోతుగల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఏడాది క్రితం నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులను ఇటీవల పూర్తిచేశారు. పాత భవనం శిథిలావస్థకు చేరడంతో కొత్త భవనాన్ని రూ.1.35 కోట్లతో నిర్మించారు. భవన నిర్మాణ సమయంలో నాణ్యత లోపంపై బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆందోళనలు చేపట్టి పంచాయతీరాజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు పనులు పూర్తికాగా, ఈనెల9న కొత్త పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పాత భవనాన్ని 1965లో నిర్మించగా శిథిలావస్థకు చేరింది. దాని స్థానంలో కొత్త భవనం నిర్మించడంతో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**అప్పుడే పగుళ్లా.?**

కొత్తగా నిర్మించిన పీహెచ్‌సీ భవనంలోని పలు గదులు అప్పుడే పగుళ్లుబారాయి. ప్రారంభానికి ముందే గోడలు నెర్రెలు బారడం ఏంటని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇలాంటి పనులు జరుగుతున్నాయని గ్రామస్తులు తెలుపుతున్నారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన భవనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని అప్పుడే ఫిర్యాదు చేశామని, ఎవరూ చర్యలు తీసుకోలేదన్నారు. కలెక్టర్ దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

### రేషన్ బియ్యం పట్టివేత

**ఇల్లంతకుంట:** రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన గంట ఎల్లయ్య (32) మండలంలోని ముస్కాన్‌పేట గ్రామ సమీపంలో 8 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచాడు. బియ్యాన్ని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



**కోనరావుపేట:** గ్రామాల్లో సంచరిస్తున్న శునకాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మండల వైద్యాధికారి వేణుమాధవ్ కోరారు. కనగర్తిలో శునకాల కారణంగా చిన్నారికి వైరస్ సోకడంతో గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న చిన్నారులు, ప్రజలను గుర్తించారు. వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. జ్వరాలతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అఖిల్, ఎంపీవో ఆరిఫ్‌పాషా, సూపర్‌వైజర్ రషీద్, హెల్త్ అసిస్టెంట్ సవాయిలాల్, కార్యదర్శి కవితారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



**ఇల్లంతకుంట:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ నారాయణ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని వైశ్య భవన్‌లో తంగళ్లపల్లి సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. తన వ్యవసాయ బావి వద్ద మోటార్ లో వోల్టేజీతో నడవడం లేదని, అధికారులకు విన్నవించాన పట్టించుకోవడం లేదని ముస్కాన్‌పేట రైతు పోతరాజు పరుశురాం చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. ఇల్లంతకుంట విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి నేరెళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే విద్యుత్ లైన్ వైర్లు కిందకు వేలాడుతున్నాయని సరిచేయాలని రైతు కృష్ణారెడ్డి చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు.15 మంది రైతులు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల విద్యుత్ వినియోగదారులు మెంబర్లు, సెస్ డీఈ సుబ్బారెడ్డి, ఏఈ నగేశ్‌కుమార్, మధుకర్, దేవేందర్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎంపీడీవోకు వినతి

**వీర్నపల్లి:** మండలంలోని బావుసింగ్ నాయక్‌తండాలో ఉపాధిహామీ పథకంలో అవకతవకలు జరిగినట్లు తండా గిరిజనులు శుక్రవారం ఎంపీడీవో వాజిద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తండా గిరిజనులు మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా ఉపాధి హామీలో దాదాపు రూ.5 లక్షల వరకు పనులు చేయకుండా కొందరు వారి సొంత స్వలాభం కోసం పనిచేసినట్లు మాస్టర్‌లో సంతకాలు పెట్టి డబ్బులు కాజేసినట్లు తండావాసులు పేర్కొన్నారు. వారిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

### పారాబాయిల్డ్ మిల్ వద్దు

- స్పష్టం చేసిన ఎల్లారెడ్డిపేట రైతులు

**ఎల్లారెడ్డిపేట:** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులో ఇప్పటికే ఉన్న రా రైస్‌మిల్లు నుంచి వచ్చే వ్యర్థాలతో ఇబ్బంది పడుతుంటే, ఇప్పుడు పారాబాయిల్డ్ నిర్మించాలని చూస్తున్నారని రైతులు పేర్కొన్నారు. పారాబాయిల్డ్ రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతులు ఇవ్వవద్దని రైతులు కోరారు. ఇదే విషయమై రైతులు ఇటీవల కలెక్టర్‌తోపాటు పొల్యూషన్‌బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎస్వో వసంతలక్ష్మి, తహసీల్దార్ రామచంద్రం శుక్రవారం క్షేత్రస్థాయిలో విచారణకు వచ్చారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని రైతులు మాట్లాడుతూ ఇప్పటికే ఉన్న రా రైస్‌మిల్లుతోనే ఇబ్బంది పడుతున్నామని, బాయిల్డ్ రైస్‌మిల్లుకు అనుమతులే ఇవ్వవద్దని కోరారు. వెంటనే స్పందించిన అధికారులు రుద్ర రైస్‌మిల్ చుట్టూ ప్రహరీ నిర్మించాలని, ఉనుక, ఇతర డస్ట్ బయటకు రాకుండా రేకులషెడ్డు నిర్మించాలని యజమానికి అధికారులు ఆదేశించారు.

### కుర్చీలు లేక .. నిలబడే విని



**ముస్తాబాద్:** మండల పరిషత్ సమావేశ మందిరంలో నట్టల నివారణ మాత్రల పంపిణీపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. హాజరైన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, సీఆర్‌పీలు, ప్రభుత్వ వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. సీట్లు సరిపోకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు నిలబడే ఉన్నారు. గంటకు పైగా నిర్వహించిన సదస్సులో ఒక పక్కకు నిలబడి అధికారులు చెప్పిన విషయాలను విన్నారు. తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో బీరయ్య, వైద్యాధికారి గీతాంజలి పాల్గొన్నారు. గంటకు పైగా నిలబడే అధికారులు చెప్పిన విషయాలను విన్నామని ఆశలు, అంగన్‌వాడీ టీచర్లు పేర్కొన్నారు.

### ఉపాధి కూలీ చెల్లించాలి

**సిరిసిల్లటౌన్:** ఉపాధిహామీ కార్మికులకు నిలిపివేసిన కూలీ వెంటనే కేంద్రం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. సిరిసిల్లలోని కార్మిక భవన్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. మూడు నెలలుగా బకాయిలు చెల్లించడం లేదన్నారు. ఎండలు ముదురుతుండడంతో టెంట్లు, తాగునీటి వసతి కల్పించాలని కోరారు. సోమ నాగరాజు, కిశోర్ పాల్గొన్నారు.

### కంపుకొడుతున్నయ్..





**కోనరావుపేట:** మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద నిర్మించిన మూత్రశాలలు కంపుకొడుతున్నాయి. మండలకేంద్రానికి పలు గ్రామాలనుంచి వచ్చే ప్రయాణికులు, ప్రజల కోసం ప్రయాణ ప్రాంగణం పక్కన మరుగుదొడ్డి, మూత్రశాలలు నిర్మించారు. కొన్ని రోజులుగా శుభ్రపర్చకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. మూత్రశాలలు మూడు ఉండగా రెండు తొట్లు పగిలిపోయి నెలలు గడుస్తోంది. ఇప్పటివరకు తిరిగి ఏర్పాటు చేయలేదు. మండలకేంద్రం కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధికసంఖ్యలో కోనరావుపేటకు వస్తుంటారు. బస్టాండ్‌లోని మరుగుదొడ్డి, మూత్రశాలల నిర్వహణ సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

### రైతులకు యూరియా తిప్పలు



ఎల్లారెడ్డిపేటలో యూరియా కోసం రైతులు పడిగాపులు

**ఎల్లారెడ్డిపేట:** యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయ పనులను వదులుకొని యూరియా కోసం సింగిల్‌విండో కార్యాలయాల వద్ద బారులుతీరుతున్నారు. ప్రభుత్వం ముందుచూపుతో ఈ సీజన్‌కు సరిపడా యూరియాను కేంద్ర ప్రభుత్వం నుంచి తెప్పించి రైతులకు సకాలంలో అందించాల్సి ఉండగా అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఇటు సింగిల్‌విండోలు, గ్రోమోర్ కంపెనీ దుకాణాల్లో యూరియా అందుబాటులో ఉంచడం లేదన్న ఆరోపణలున్నాయి. అధికారులు, నాయకులు స్పందించి రైతులకు సరిపడా యూరియా అందించాలని రైతులు కోరుతున్నారు.